నమస్తే తెలంగాణ

# హైదరాబాద్

హైదరాబాద్- మేడ్చల్

I | హైదరాబాద్, సోమవారం 22 జూలై 2024 | HYDERABAD





కనిపించని పోలీస్‌స్టేషన్..ఉజ్జయిని మహంకాళి జాతర సందర్భంగా రాంగోపాల్ పేట పోలీస్‌స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన కాంగ్రెస్ నేతల ఫ్లెక్సీలు



ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి తొలి బోనం సమర్పిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్







## అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రి సీతక్క, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, హైకోర్టు జడ్జి సూరేపల్లి నంద, ఎంపీలు ఈటల రాజేందర్, డాక్టర్ లక్ష్మణ్, ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, మల్లారెడ్డి, దానం నాగేందర్, శ్రీ గణేశ్, సీఎస్ శాంతికుమారి, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, దేవదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యార్, బల్దియా కమిషనర్ ఆమ్రపాలి, నగర పోలీస్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, మాజీ ఎంపీ హన్మంతరావు తదితరులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

# తల్లీ..అందుకో బోనం

## పులకించిన లష్కర్..పోటెత్తిన భక్తజనం ◆ వైభవంగా మహంకాళి బోనాల జాతర



బేగంపేట, జూలై 21: శివసత్తుల సందడి, పోతరాజుల విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలతో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో లష్కర్‌లో ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నది. ఉత్సవాల్లో భాగంగా తెల్లవారుజామున 3.30 గంటలకు మంత్రి పొన్నం ప్రభాకర్ అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. ఉదయం 8.30 సీఎం రేవంత్‌రెడ్డి అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దేవాదాయ శాఖ సౌకర్యాలు కల్పించింది. అమ్మవారిని దర్శించుకునేందుకు సాధారణ భక్తులకు మూడు క్యూలైన్లు, బోనాలు సమర్పించే మహిళలకు రెండు క్యూలైన్లు, వీఐపీ కోసం ఒక క్యూలైన్‌ను ఏర్పాటు చేశారు. భక్తుల కోసం జలమండలి తాగునీటి వసతి కల్పించగా, జాతరను తిలకించేందుకు వివిధ ప్రాంతాల్లో ప్రత్యేకంగా ఎల్ఈడీ తెరలను పెట్టారు. క్యూలైన్లలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా బల్దియా సిబ్బంది, వివిధ విభాగాల వలంటీర్లు సహాయ సహకారాలు అందించారు.





అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం రేవంత్‌రెడ్డి

తెల్లవారుజామున తొలి బోనం సమర్పించిన మంత్రి పొన్నం ప్రభాకర్

నేడు రంగం వేడుకలు.. అంబారీపై అమ్మవారి ఊరేగింపు

### ముత్యాలమ్మ ఆలయంలో..

టకారబస్తీలోని ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ నివాసంలో బోనాల వేడుకలు వైభవంగా జరిగాయి. పద్మారావుగౌడ్ స్థానిక ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. బోనాల వేడుకల్లో మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, ముఠాగోపాల్, ఎమ్మెల్సీ సురభివాణీదేవి తదితరులు పాల్గొన్నారు.

### గోల్కొండ ఎల్లమ్మకు 5వ బోనం

మెహిదీపట్నం: గోల్కొండ జగదాంబిక అమ్మవారికి ఆదివారం ఐదో బోనం పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో గోల్కొండ కోటకు చేరుకొని అమ్మవారికి ఘనంగా బోనం, తొట్టెలను సమర్పించారు.



### నేడు రంగం

సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయంలో సోమవారం రంగం వేడుకలు నిర్వహించనున్నారు. జోగిని స్వర్ణలత భవిష్యవాణి వినిపిస్తారు. అనంతరం అమ్మవారిని అంబారీపై ఊరేగిస్తారు.

# దొంగలు దొరకరు... కేసు క్లోజ్..!

సైబర్‌నేరాల్లో పత్తా లేని అసలు నేరస్తులు

రోజు రోజుకు పెరుగుతున్న కేసుల సంఖ్య

చేసేది లేక చేతులెత్తేస్తున్న సైబర్ పోలీసులు



సిటీబ్యూరో: సైబర్ నేరాలు పెరిగిపోతున్నాయి. అమాయకులను మోసం చేసి..వివిధ రకాలుగా నేరస్తులు కోట్లు దోచేస్తున్నారు. దీంతో రోజుకు పదికిపైగా కేసులు నమోదవుతున్నాయి. అయితే 90 శాతం వరకు అసలు నిందితులు పోలీసులకు చిక్కడం లేదు. విదేశాల్లో ఉంటూ..నేరాలకు పాల్పడుతున్నారనే మాట పోలీసులు చెబుతున్నారు. అసలు నేరస్తులు దొరకడం లేదు.. ఏం చేస్తాం.. కేసు మూసేద్దామంటూ.. పోలీసులు పాత కేసులను క్లోజ్ చేస్తున్నారు.

### 1930కు ఫిర్యాదు..

సైబర్‌నేరాలు జరిగిన వెంటనే జీరో అవర్‌లో 1930కు, నేషనల్ సైబర్‌క్రైమ్ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తే పోయిన సొత్తు వెనక్కి వచ్చేందుకు అవకాశాలుంటాయి. అయితే బాధితులు ఈ పోర్టల్‌లో ఫిర్యాదు చేస్తుంటారు. ఆ తరువాత పోర్టల్ నుంచి సైబర్‌నేరగాళ్లకు సంబంధించిన బ్యాంకు ఖాతాలు ఫ్రీజ్ అయ్యాయంటే బాధితుల అదృష్టమే. నిందితులకు సంబంధించిన బ్యాంకు ఖాతాల్లో డబ్బు ఆగలేదంటే బాధితులకు డబ్బు రావడం కష్టమే. ఆ సమయంలో పోలీసులు సైతం ఇక మేం ఏమి చేస్తామన్న ధోరణితో వ్యవహరిస్తున్నారు.

### ఆధారాలు లేకపోతే..

ఎక్కడో ఉంటూ మోసాలకు పాల్పడుతూ..సామాన్యులను సైబర్‌నేరగాళ్లు దోచేస్తున్నారు. పోలీసులు నిందితుల సెల్ ఫోన్, బ్యాంకు ఆధారం ఉంటేనే వాళ్లను పట్టుకోవడం కోసం ప్రయత్నిస్తుంటారు. ఈ ఆధారాలు లేకపోతే ఆ కేసు పక్కన పడిపోతుంది. ఆర్థికపరమైన మోసాలకు సంబంధించిన సైబర్‌నేరాల్లో చాలా వరకు కేసుల్లో అసలు నిందితులు పోలీసులకు చిక్కడం లేదు. ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఫెడెక్స్, ట్రేడింగ్ వంటి కేసుల్లో ప్రజలు భారీగా నష్టపోతున్నారు. అయితే సూత్రధారులు ఇతర దేశాల్లో ఉంటూ నేరాలు చేస్తున్నారని, ఆయా కేసుల్లో నిందితులు పట్టుబడటం కష్టమనే భావనతో పోలీసులు చేతులెత్తేస్తున్నారు. ఇలా పాత కేసుల్లో అసలు నిందితులు దొరకలేదన్న కారణంతో కేసులను మూసేస్తున్నారు.

# అండర్ గ్రౌండ్ టన్నెల్ సాధ్యమేనా..?

## రెండు ఎలివేటెడ్ కారిడార్లు చేపట్టిన హెచ్ఎండీఏ

సిటీబ్యూరో: హెచ్ఎండీఏ రెండు ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టులను ప్రతిష్టాత్మకంగా చేపట్టింది. అందులో ఒకటి ప్యారడైజ్ నుంచి దుండిగల్ వరకు, మరొకటి ప్యాట్నీ నుంచి శామీర్‌పేట వరకు ఉన్నాయి. కాగా, బల్దియాలో కంటోన్మెంట్ విలీనం, ఎలివేటెడ్ కారిడార్లకు భూములు ఇచ్చేందుకు రక్షణ శాఖ ఆమోదం తెలుపడంతో... ఎట్టకేలకు ప్రాజెక్టుల నిర్మాణానికి ఓ అడుగు పడింది. అయితే హెచ్ఎండీఏ పూర్తి స్థాయి ఎలివేటెడ్ కారిడార్ లేదా మల్టీ మోడల్ ట్రాన్స్‌పోర్టుకు వీలుగా ఉండేలా... డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌గాను, ఎలివేటెడ్ కమ్ అండర్ గ్రౌండ్ టన్నెల్ విధానంలో ప్రాజెక్టులను నిర్మించేలా ప్రతిపాదనలు చేస్తోంది. అయితే ఈ మార్గంలో అండర్ గ్రౌండ్ టన్నెల్ సాధ్యమేనా అనే అనుమానాలు ప్రస్తుతం వ్యక్తమవుతున్నాయి. పరేడ్ గ్రౌండ్ నుంచి శామీర్‌పేట వరకు 18కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్‌ను ఆరు లైన్లతో నిర్మించాలని ప్రతిపాదించారు. ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి 192 ఎకరాల భూమి అవసరం ఉండగా, ఇందులో 113 ఎకరాల వరకు డిఫెన్స్ భూములు, 83 ఎకరాల ప్రైవేటు భూములు ఉన్నాయి. అలాగే సికింద్రాబాద్‌లోని ప్యారడైజ్ నుంచి కొంపల్లి అవతల ఉన్న డెయిరీ ఫాం వరకు ఆరు లైన్లలో మరో ఎలివేటెడ్ కారిడార్ చేపట్టనున్నారు. ఇందులో 18 కిలోమీటర్ల మేర ఫ్లైఓవర్ అందుబాటులోకి రానున్నది. ప్యారడైజ్ జంక్షన్ నుంచి మొదలై ఈ ఎలివేటెడ్ కారిడార్‌కు బేగంపేట విమానాశ్రయం పెద్ద అడ్డంకిగా మారేలా ఉంది. బేగంపేట ఎయిర్‌పోర్టు హద్దులు ఈ ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి అసాధ్యంగా మారుతున్నది. ముఖ్యంగా ఎయిర్‌పోర్టు పరిసరాల్లో భవనాలు, నిర్మాణాల ఎత్తుపై పరిమితులు ఉంటాయి. దీంతో ఎయిర్‌పోర్టు వర్గాలు ఎలివేటెడ్ కారిడార్ విషయంలో పలు సూచనలు, మార్పులు చేసే అవకాశం ఉన్నదని తెలిసింది.

# ఏదీ.. లాస్ట్ మైల్ కనెక్టివిటీ

## మెట్రో స్టేషన్లతో అనుసంధానం కాని ప్రజా రవాణా వ్యవస్థలు



మెట్రో కారిడార్-3లోని నాగోల్‌లో ప్రయాణికుల వాహనాల పార్కింగ్ కోసం ఏర్పాటు చేసిన స్థలం


సిటీబ్యూరో: నగరంలో మెట్రో సేవలు అందుబాటులోకి వచ్చిన తర్వాత ప్రజా రవాణా వ్యవస్థలోనే అత్యంత వేగంగా ప్రయాణికులు తమ గమ్యస్థానాలకు చేరుకుంటున్నారు. అలాంటి మెట్రో రైలు నెట్ వర్క్‌లో లాస్ట్ మైల్ కనెక్టివిటీ అన్న అంశం ప్రచారానికే పరిమితమైంది. మెట్రో సేవలు ప్రారంభమై 6 ఏండ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ లాస్ట్ మైల్ కనెక్టివిటీ అనేది ఆమడ దూరంలోనే ఉంది. మెట్రోలో ప్రయాణం చేసే వారంతా తమ ఇంటి నుంచి సొంత వాహనాలపైనే మెట్రో స్టేషన్లకు చేరుకొని.. అక్కడే పార్కింగ్ చేస్తున్నారు. ముఖ్యంగా మెట్రో కారిడార్-3లో ప్రారంభ మెట్రో స్టేషన్ అయిన నాగోల్‌లో వాహనాల 3-4 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాన్ని అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐటీ కారిడార్‌ను అనుసంధానం చేసే ఈ మెట్రో మార్గంలోనే ప్రయాణికులు గణనీయంగా పెరగడంతో సొంత వాహనాలు సైతం ఆదే స్థాయిలో పెరిగాయి. దీంతో మెట్రో అధికారులు అదనంగా మరిన్ని వాహనాలను పార్కింగ్ చేసుకునేందుకు వీలుగా పార్కింగ్ స్థలాన్ని ఉప్పల్ మెట్రో డిపో, కమాండ్ కంట్రోల్ సెంటర్ పక్కన ఏర్పాటు చేశారు. ఒకేసారి అన్ని రకాల వాహనాలు కలిపి 600లకు పైగా వాహనాలను పార్కింగ్ చేసుకునే అవకాశం ఇక్కడ ఉంది. ఇలా ఒక్క నాగోల్ మెట్రో స్టేషన్‌లోనే కాదు.. ప్రారంభ మెట్రో స్టేషన్లు, మధ్యలో ఉండే ఇంటర్ చేంజ్ స్టేషన్లలో, ఇతర మెట్రో స్టేషన్లలోనూ పార్కింగ్ సౌకర్యాలను కల్పిస్తున్నారే తప్ప.. ఆయా మెట్రో స్టేషన్లతో ప్రజా రవాణా వ్యవస్థలైన ఆర్టీసీ, ఎంఎంటీఎస్,సెట్విన్,ఆటో రిక్షాలను మాత్రం అనుసంధానం చేయడం లేదు.



## రేవంత్ తాతయ్య.. మా కాలనీలో రోడ్డు వేయండి

జవహర్‌నగర్, జూలై 21: 'సీఎం రేవంత్ తాతయ్య.. మా కాలనీకి వెళ్లాలంటే భయంగా ఉంది.. రోడ్డంతా బురదమయంగా ఉంది. స్కూల్‌కు..వెళ్లాలన్నా..బయటకు వెళ్లాలన్నా.. ఇబ్బందులుపడుతున్నాం.. మా కాలనీకి రోడ్డు వేయండి ప్లీజ్' అంటూ.. జవహర్‌నగర్‌లోని 28వ డివిజన్ లక్ష్మీనర్సింహాకాలనీకి చెందిన చిన్నారి విశ్వజిత్ తన చిట్టిపొట్టి మాటలతో సోషల్ మీడియా వేదికగా రిక్వెస్ట్ చేయగా.. ప్రస్తుతం ఆ వీడియో వైరల్‌గా మారింది.

# 3 నెలల్లో లక్ష కోట్లకు పెరగడమేంటీ?




## మూసీ సుందరీకరణ అంచనా వ్యయంపై సీఎంకు నెటిజన్ల ప్రశ్న

సిటీబ్యూరో: మూసీ సుందరీకరణ అంశం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. అధికారంలోకి రాగానే సీఎం రేవంత్‌రెడ్డి మూసీని రూ. 50వేల కోట్లతో లండన్‌లోని థేమ్స్ తరహాలో అభివృద్ధి చేస్తామన్నారు. అయితే శనివారం గోపన్‌పల్లిలో జరిగిన ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో ఐదేండ్లలో రూ. లక్షన్నర కోట్లు ఖర్చుపెట్టి మూసీకి ఊపిరిపోస్తామన్నారు. అంటే కేవలం మూడు నెలల్లోనే రూ. 50వేల కోట్ల నుంచి రూ.లక్షన్నర కోట్లకు వ్యయం పెరిగినట్టు అర్థమవుతున్నది. దీంతో సీఎం మాటలపై నెటిజన్లు ప్రశ్నలు సంధిస్తున్నారు. మాస్టర్ ప్లాన్ లేకుండా, ప్రాజెక్టు రిపోర్టులు తయారు కాకుండానే అంచనా వ్యయం పేరిట లక్ష కోట్లకు పెంచేయడమేంటని ప్రశ్నిస్తున్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు ప్రారంభానికి ముందే మూడింతలు పెరిగితే... ఇక ప్రాజెక్టు కార్యారూపంలోకి వచ్చి పూర్తయ్యే లోపు ఎంత ఖర్చు చేస్తారంటూ వ్యాఖ్యానిస్తున్నారు. మూసీ సుందరీకరణ కోసం చేపట్టాల్సిన ప్రాజెక్టుకు కార్యాచరణ, ప్రణాళిక లేకుండా పోతే ప్రజాధనం వృథా అవుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది.